## క్లుప్తంగా

### వరి పంట పరిశీలన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం గోవిందపేట్‌లో సాగవుతున్న వరి పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి హరికృష్ణ శుక్రవారం పరిశీలించారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు అధికంగా ఉండడం గమనించిన ఏవో రైతులకు నివారణ చర్యలు తెలియజేశారు. క్లోరో ఫైరిఫాస్ లేదా కార్బస్ హైడ్రో క్లోరైడ్ మందులను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అలాగే జింక్ లోప నివారణకు జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేసుకోవాలని తెలిపారు

### ఆలయ నిర్మాణ పనులు..



రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న మహా లక్ష్మమ్మ ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక సర్పంచ్ కర్లం సాయరెడ్డితో కల్సి బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు అరికెల సాయరెడ్డి, మాధవరెడ్డి, అశోక్ తదితరులు ఉన్నారు.

### చెక్కుల అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన పలువురికి శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీపీ పస్క నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంజి నర్సయ్య, ఉప సర్పంచ్ గంగా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



మోర్తాడ్: మండలంలోని దొన్కల్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. శాస్త్రోక్తంగా పురోహితుడు రవీందర్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

### పెళ్లికి అండగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్



మోర్తాడ్: ఏర్గట్ల మండలంలోని గుమ్మిర్యాల్‌లో పేదరికంతో బాధపడుతూ తమ కూతురి పెళ్లి ఎలా చేయాలో తెలియక ఆందోళనలో ఉన్న కుటుంబానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు అండగా నిలిచారు. శుక్రవారం పెళ్లింటికి వెళ్లి బచ్చు రాజేందర్, రాజమణిల కూతురు మానస పెళ్లికి అవసరమైన పుస్తె మట్టెలు, పెళ్లి చీరను అందించడంతో పాటు అతిథులకు భోజన సదుపాయం కోసం సామాగ్రిని అందించారు. స్థానిక సర్పంచ్ సోమ పెద్ద రాజారెడ్డి, ఇబ్రహీంపట్నం పద్మశాలి సంఘం అధ్యక్షుడు గణేష్‌లు కూడా ఆర్థిక సహాయం అందించారు.

### శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం



కమ్మర్‌పల్లి: శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఇనాయత్‌నగర్‌లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విజేతగా నిలిచిన కోనాపూర్ జట్టుకు, రన్నర్‌గా నిలిచిన ఇనాయత్‌నగర్ జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్‌లు లస్కర్ నాయక్, ప్రభాకర్, యూత్ అధ్యక్షుడు రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

# మొరం తరలింపుపై ఆగ్రహం

- దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని టిప్పర్లను అడ్డుకున్న మాదాపూర్ గ్రామస్తులు
- చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమణ



తహసీల్దార్ శంకర్‌కు వినతి పత్రం



మొరం టిప్పర్లను అడ్డుకుంటున్న కాలనీ వాసులు

మాక్లూర్: రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇళ్ల మధ్య నుంచి భారీ టిప్పర్ల ద్వారా మొరం తరలించటాన్ని నిరసిస్తూ మండలంలోని మాదాపూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. మొరం లోడుతో ఏకధాటిగా వెళ్తున్న టిప్పర్ల వల్ల దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరి భోజనం చేయలేని పరిస్థితి నెలకొంటుందని, ఊపిరితిత్తుల వ్యాధితో ఇప్పటికే కాలనీకి చెందిన 10 మందికి పైగా మృతి చెందారని వారు మండిపడ్డారు. మొరం వ్యాపారులు ఇచ్చే ముడుపులకు ఆశపడి అధికారులు పట్టించుకోవటం లేదంటూ మండిపడ్డారు. శుక్రవారం మొరం టిప్పర్ల రాకపోకలు సాగించే ఐఎంఎల్ డిపో పక్కనే ఉన్న రోడ్డుపై బైఠాయించారు. దీంతో పదుల సంఖ్యలో మొరం టిప్పర్లు ఎక్కడికక్కడే నిల్చిపోయాయి. తహసీల్దార్ శంకర్, ఎస్సై యాదగిరిగౌడ్ అక్కడికి చేరుకొని సమస్యను అడిగి తెలుసుకున్నారు. తక్షణ చర్యగా మొరం టిప్పర్లను మరో చోటి నుంచి వెళ్లేలా చేస్తామని హామీ ఇచ్చారు. అనుమతుల మేరకే ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే నడిచేలా చర్యలు తీసుకుంటామని, ఈ సారికి తాము ఇచ్చిన హామీని నమ్మాలని అధికారులు కోరగా, డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శంకర్‌కు అందజేసి, ఆందోళన విరమించుకున్నారు. అనంతరం సీపీఎం నాయకుడు కడుప లక్ష్మణ్ మాట్లాడుతూ.. గుట్టను తవ్వి మొరం తరలించగా ఏర్పడిన ఖాళీ స్థలంలో ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామంటూ అమాయకులను నమ్మిస్తూ కొందరు అక్రమ మొరం దందా చేస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆందోళనలో సీపీఎం నాయకుడు కొండ గంగాధర్, రామకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

# కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



కంటి అద్దాలు తొడుగుతున్న పద్మాశరత్ రెడ్డి

మాక్లూర్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సూచించారు. శుక్రవారం చిక్లీ గ్రామంలో కండి వెలుగు శిబిరాన్ని విఠల్‌రావు ప్రారంభించి మాట్లాడారు. కంటి జబ్బులు సోకి ఆసుపత్రిలో వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో ఎంతో మంది నిరుపేదలు కంటి చూపు కోల్పోతున్నారని, అలాంటి వారికి ప్రస్తుతం నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలు ఒక వరం లాంటివన్నారు.

**కంటి వెలుగు కేంద్రాల పరిశీలన**

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని 19, 26వ వార్డుల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి పరిశీలించారు. కంటి పరీక్షల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఎంత మంది చికిత్స చేయించుకుంటున్నారని, ప్రజలు కంటి వెలుగు కేంద్రానికి వచ్చేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. చైర్ పర్సన్ వెంట కమిషనర్ ఖమర్ హైమద్, కౌన్సిలర్లు పిట్ల సత్యం, సంధ్యా రెడ్డి, తూము శరత్ రెడ్డి ఉన్నారు.

**రుద్రూర్‌లో..డీఎల్‌పీవో**

రుద్రూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి పరీక్ష శిబిరాన్ని శుక్రవారం బోధన్ డీఎల్‌పీవో గౌసొద్దీన్ పరిశీలించారు. కంటి పరీక్షల వివరాలు సిబ్బంది ద్వారా తెల్సుకున్నారు. కంటి పరీక్షలు చేయించుకునేటట్లు అవగాహన కల్పించాలన్నారు.

**వేల్పూర్‌లో కంటి శిబిరం ప్రారంభం**

వేల్పూర్: మండల కేంద్రంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధిఆరులు ప్రారంభించారు. గ్రామస్తులంతా కంటి పరీక్షలు చేయించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్, ఎంపీపీ బీమజమున, సర్పంచ్ తీగెల రాధా మోహన్, ఉప సర్పంచ్ పిట్ల సత్యం, ఎంపీటీసీ మొండి మహేశ్ పాల్గొన్నారు.



రుద్రూర్‌లో పరిశీలిస్తున్న డీఎల్‌పీవో గౌసొద్దీన్



వేల్పూర్‌లో ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

# సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడి ఉద్యోగులు

పెర్కిట్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు పల్లెపు వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం, పింఛను, ఈఎస్‌ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అంగన్వాడీ వర్కర్ పేరును టీచర్‌గా మార్చిన సీఎం కేసీఆర్ ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు కల్పించడం లేదని వాపోయారు. డిమాండ్లను పరిష్కరించకపోతే మార్చి 1 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ అధికారిణికి వినతి పత్రం అందజేశారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు చంద్రకళ, జగదాంబ, సునంద, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

భీమ్‌గల్: ఇచ్చిన హామీ మేరకు రాబోయే బడ్జెట్ సమావేశాల్లో నిధులను పెంచి, అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు, జిల్లా అధ్యక్షురాలు దేవ గంగు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి, ఇన్‌చార్జి సీడీపీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి యమున, జిల్లా నాయకురాలు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

బోధన్: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రెండు నెలల వివిధ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సీడీపీవో జానకమ్మకు వినతి పత్రం అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు రాణి, మేరి, శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

### బకాయి బిల్లులు విడుదల చేయండి



ఎడపల్లి: ఆందోళన చేస్తున్న కార్మికులు

ఎడపల్లి(బోధన్): బకాయి పడ్డ బిల్లులను విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. అలాగే చిన్నపిల్లలకు అందించే పౌష్టికాహారం, కోడిగుడ్లను నేరుగా ప్రభుత్వమే సప్లై చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎడపల్లిలో తహసీల్దార్‌కి శుక్రవారం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గత ఏడాది మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.3వేల వేతనం ఇస్తానని హామీ ఇచ్చారని, ఏడాది గడుస్తున్నా ఇప్పటికి అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. అలాగే కార్మికులకు ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.

# పరీక్షల ఒత్తిడిని జయించాలి



పరీక్షా పే చర్చ వీక్షిస్తున్న నాయకులు, విద్యార్థులు

నవీపేట: పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని, ఒత్తిడిని అధిగమించి పరీక్షలు రాయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు బస్వాలక్ష్మీ నర్సయ్య సూచించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన పరీక్షాపే చర్చ కార్యక్రమాన్ని జన్నేపల్లిలోని ఎస్ఎస్ఆర్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి వీక్షించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఏకాగ్రతతో చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థులకు ఆర్ట్, డ్రాయింగ్ విభాగాలలో పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డి మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, నాళేశ్వర్ సర్పంచ్ సరిన్, ఎంపీటీసీ మైసరాధ, తదితరులు పాల్గొన్నారు.

**క్షత్రియ జూనియర్ కళాశాలలో..**

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రధాన మంత్రి పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఇటీవల ఎన్‌డీఎంసీ, పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో క్షత్రియ విద్యా సంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, కార్యదర్శి దేవేందర్, ప్రిన్సిపల్ నాగేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

### విజేతలకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

మాక్లూర్: చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిల్చిన విద్యార్థినులకు శుక్రవారం బీజేపీ ఆర్మూర్ కన్వీనర్ పాలెపు రాజు, గంగోనే సంతోష్‌లు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ నెల 21న జరిగిన జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో అడవిమామిడిపల్లి పాఠశాలకు చెందిన 36 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో ముగ్గురు విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి బహుమతులను అందజేసి మిగితా విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని విద్యార్థులకు చూపించారు.

**విద్యార్థులకు బంగారు పతకాలు**

మోర్తాడ్: చిత్రలేఖనం, హ్యాండ్ రైటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మోర్తాడ్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులను బంగారు, వెండి పతకాలు వరించాయి. ముంబైలోని రంగోత్సవ్ సెలబ్రేషన్స్ సంస్థ చిత్రలేఖనం, హ్యాండ్ రైటింగ్ పోటీలను నిర్వహించగా 24 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముగ్గురు విద్యార్థులకు బంగారు, మరో ముగ్గురు విద్యార్థులకు వెండి పతకాలు వరించగా ఇతర విద్యార్థులకు ప్రశంసా పత్రాలు లభించాయి. వీటిని సర్పంచ్ భోగ ధరణి పంపిణీ చేశారు.

### సీఆర్పీల మహాసభను జయప్రదం చేయండి

కమ్మర్‌పల్లి: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఈ నెల 29న క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర దశాబ్ది మహాసభను జయప్రదం చేయాలని సీఆర్పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంబదాస్ రావు, అంజయ్య శుక్రవారం కోరారు. సీఆర్పీలుగా ఉద్యోగంలోకి అడుగిడి 10 సంవత్సరాలు గడిచిన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న మహాసభకు మంత్రి సబితారెడ్డి, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరవుతారని తెలిపారు.

### పోస్టాఫీసులో ఖాతాలు తెరవండి

బోధన్‌టౌన్/ఆర్మూర్ టౌన్: తపాలా శాఖ నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జనవరి28న ప్రజలు మీ దగ్గరలోని పోస్టాఫీసులో ఖాతాలు తెరవాలని తపాలా శాఖ బోధన్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ గజ్జెల వేణు, తపాలా ఆర్మూర్ శాఖ సహాయ పర్యవేక్షకురాలు యాపరు సురేఖ కోరారు. తపాలా శాఖలో జనవరి 1 నుంచి వడ్డీ రేట్లు పెరిగాయని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా కోటి ఖాతాలు 'ఏక్ దిన్ మే ఏక్ క్రోడ్ ' అనే నినాదంతో ఉద్యోగులు ప్రజల ముందుకు వస్తున్నారన్నారు.

### జిల్లా కోసం కొనసాగుతున్న దీక్షలు




బోధన్: ప్రత్యేక జిల్లా డిమాండ్‌తో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. శుక్రవారం నాటికి దీక్షలు 40వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షలో గోసంగి కుల సంఘం డివిజన్ కమిటీ నాయకులు, సభ్యులు కొండపల్లి గంగాధర్, వీరేశం, గంగాధర్, పీరయ్య, లక్ష్మణ్, రాములు, ప్రకాష్, ఎల్లప్పలు కూర్చున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగారెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలకు నిధులు పెంచండి



బోధన్: భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ పథకాలకు నిధులు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి మల్లేష్, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలకు ప్రభుత్వం అరకొర నిధులు కేటాయిస్తోందని ఆరోపించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని వీరేశలింగం పార్కులో భవన నిర్మాణ రంగ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు తన్వీర్, హసీమ్, ఇమామ్, అబ్దుల్, సూరి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

### చరిత్ర పరిశోధకులు సిద్ద సాయరెడ్డికి నివాళులు



బోధన్: లంగ్డాపూర్‌కు చెందిన ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, విశ్రాంత అధ్యాపకుడు సిద్ద సాయరెడ్డి ఇటీవల కన్ను మూశారు. స్థానిక పంపా సాహితీ పీఠం ఆధ్వర్యంలో సాయరెడ్డి సంస్మరణ సభను శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసులో నిర్వహించారు. ఆయన సాహితీ పీఠానికి సలహాదారులుగా బాధ్యతలు నిర్వర్తించారు. సాయరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి ఆర్డీవో రాజేశ్వర్, పీఠం ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు.

**కార్మిక నేత సాయిలుకు..**

బోధన్: ఎన్‌డీఎస్ఎల్ విశ్రాంత కార్మికుడు, సీఐటీయూ నేత, అమరుడు ఓటర్కార్ సాయిలుకు కార్మికులు ఘన నివాళులర్పించారు. ఈ నెల 13న సాయిలు గుండె పోటుతో మృతి చెందారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో సీఐటీయూ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సాయిలు సంస్మరణ సభను నిర్వహించారు. నేతలు శంకర్‌గౌడ్, గంగాధర్ అప్ప పాల్గొన్నారు.

### అసత్య ఆరోపణలు చేస్తే సహించం



వర్ని/మోస్రా/కోటగిరి/రుద్రూర్: శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని బాన్సువాడ బీజేపీ ఇన్‌చార్జి మాల్యాద్రి రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. వర్ని, మోస్రా, కోటగిరి, రుద్రూర్ మండల కేంద్రాలో బీఆర్ఎస్ నేతలు వేర్వేరుగా మాట్లాడారు. ప్రజా క్షేత్రంలో వార్డు మెంబరుగా కూడా గెలవని మాల్యాద్రి రెడ్డి, స్పీకర్ పోచారంపై ఆరోపణలు చేస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. అసత్య ఆరోపణలు చేసిన మాల్యాద్రి రెడ్డి వెంటనే స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో వేలాది ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నా కళ్ల కనపడటం లేదా అని ప్రశ్నించారు. ఇకపై బీజేపీ నేతలు తమ దుందుడుకు చేష్టలు మానుకోకపోతే గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు.

### కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు



– యూత్ కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డి

బోధన్: కాంగ్రెస్‌లో కష్టపడి పని చేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి అన్నారు. కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన దొడ్ల రవీందర్ రెడ్డి ఇటీవల యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం చిన్నమావందిలో గ్రామ ఉప సర్పంచ్ కంటి రాజు ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ గంగాధర్ పటేల్, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ బాబురావు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం..

### ఘనంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం



కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌లో శుక్రవారం లక్ష్మీనృసింహ స్వామి ఆలయ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పురోహితులు మాధవచారీ ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### వైభవంగా శుక్రవారం దేవి వసంతోత్సవం



కమ్మర్‌పల్లి: బషీరాబాద్‌లో శుక్రవారం దేవీ ఆలయంలో అమ్మవారి వసంతోత్సవ కార్యక్రమం పురోహితులు, దేవీ దీక్షాపరుల ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. 5 రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారికి పుష్కరిణిలో సుహాసినీలు వసంతోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పల్లకీలో గ్రామానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఉత్సవ దాతలు పోలీస్ విద్యాసాగర్, లావణ్య, సుమన్ పాల్గొన్నారు.

### ముగిసిన బ్రహ్మోత్సవాలు

బాల్కొండ: మెండోరాలోని కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు శుక్రవారం చక్రతీర్థంతో ముగిశాయి. చివరి రోజు అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### వేంపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ముప్కాల్ మండలం వేంపల్లిలో శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలను శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేశారు. శనివారం స్వామి కల్యాణం, అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### మన్మథ స్వామి జయంతి



బోధన్: వీరశైవుల ఆరాధ్య దైవం సంత్ శిరోమణి మన్మథ స్వామి జయంతి గురువారం రాత్రి పట్టణ కేంద్రంలోని ఏకచక్రేశ్వరాలయంలో జంగం సమాజ్, వీరశైవ లింగాయత్ సమాజ్‌ల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మహారాష్ట్ర ప్రాంతంలోని బీడ్ జిల్లాలో మన్మథ స్వామి వీరశైవ ధర్మ ప్రచారం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మన్మథ స్వామి చిత్రపటానికి ఊయల వేసి భక్తి గేయాలు ఆలపించారు.